మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు

మూసాపేట: ప్రగతినగర్‌లో కుంగిపోయిన డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు వాటర్ వర్క్స్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు ఆదివారం పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రగతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు భూమండ్ల అశోక్, గోపాల్, కాంట్రాక్ట్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు



మూసాపేట: మూసాపేట డివిజన్ అంబేడ్కర్ నగర్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు, బస్తీ పెద్దలు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు కర్క నిఖిల్, జనరల్ సెక్రటరి బోడ శివలను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్క రవీందర్, కర్క డాకయ్య, కర్క శివశంకర్, జెల్ల రాము, బస్తీ వాసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మట్టి వినాయకులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో మట్టి గణపతులను పూజించాలన్నారు. సోమవారం ఉదయం డివిజన్ ప్రజలకు జీహెచ్ఎంసీ అందించిన మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వీధి దీపాల సమస్య పరిష్కారానికి చర్యలు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో నెలకొన్న వీధి దీపాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విద్యుత్ సిబ్బంది, బస్తీ నాయకులతో కలిసి గౌతమ్‌నగర్‌లోని పలు కాలనీల్లో పర్యటించారు. వీధి దీపాల సమస్యను రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జగదీష్, సత్యనారాయణ, శశి, బసవరాజ్, సత్యం, సుశాంత్, సురేందర్, శేఖర్, ఇమ్రాన్, అబ్దుల్ మాలిక్, కమలమ్మ, బాలమణి, రహీమా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయ నిధి

కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో 34 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులకు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతికి చెందిన వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొంది బిల్లు చెల్లించలేని పరిస్థితిలో ఉంటే ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం కొనసాగుతుందని, ఎప్పుడైనా దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందవచ్చని తెలిపారు.



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మృత్యు శకటాలు

- శాపంగా మారిన రోడ్డు విస్తరణ పనులు
- వాహనదారుల నిర్లక్ష్యం.. అతివేగానికి నిండు ప్రాణాలు బలి
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు

నెత్తురోడుతున్న రహదారులు..!

దుండిగల్: రహదారులు నెత్తురోడుతున్నాయి. మితిమీరిన వేగం, మద్యం తాగి వాహనాలు నడపడం, రాత్రి సమయాల్లో రోడ్డు పక్కనే వాహనాలను పార్కింగ్ చేయడం, రోడ్డు పనులను మధ్యలోనే వదిలేయడం.. ఇలా కారణాలు ఏవైనా క్షణాల్లో ప్రమాదాలు జరిగి బాధిత కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపుతున్నాయి. ఇటీవలి కాలంలో దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాలే ఇందుకు అద్దం పడుతున్నాయి.

నిలిచిన రోడ్డు విస్తరణ పనులు

బాచుపల్లి రెడ్డీస్ ల్యాబ్ నుంచి గండిమైసమ్మ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణతో పాటు డివైడర్లు ఏర్పాటు చేసేందుకు 2012లో రూ.15 కోట్లతో ఆర్ అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. అయితే భౌరంపేట ప్రధాన రోడ్డులోని ఇందిరమ్మ విగ్రహం సమీపంలో 1.5 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డుకిరువైపులా అటవీ శాఖ భూమి ఉండడంతో పనులకు బ్రేక్ పడింది. దీంతో ఆ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో అటు బాచుపల్లి.. ఇటు గండిమైసమ్మ నుంచి వేగంగా వచ్చే వాహనాలు భౌరంపేట వరకు వచ్చేసరికి నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గండిమైసమ్మ చౌరస్తా నుంచి బహదూర్‌పల్లి వరకు రోడ్డు విస్తరించి డివైడర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా కోర్టులో వివాదం కారణంగా శ్రీరామ్‌నగర్ గద్ద వరకే రహదారి వెడల్పు చేసి వదిలేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా ఉండడంతో పాటు మూల మలుపు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాద ఘటనలు ఇవీ..

◆ నిజాంపేట్‌కు చెందిన చంద్రప్రకాశ్ మేడ్చల్‌లో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. గత నెల 24న తన బైక్‌పై ఇంటికి వస్తుండగా భౌరంపేట కేఎల్ యూనివర్సిటీ సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

◆ జూన్ 27న భౌరంపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తన కుమారుడిని స్కూల్‌లో దింపేందుకు స్కూటీపై వెళ్తుంది. మల్లంపేటలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద రెడీమిక్స్ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో చిన్నారి లారీ చక్రాల కింద పడి మృతి చెందాడు.

◆ రాజేంద్రనగర్‌కు చెందిన ఐటీ ఉద్యోగులు భాను ప్రకాశ్, నళినికంత బిస్వాల్ పటాన్‌చెరు నుంచి మల్లంపేట వైపు కారులో వేగంగా వస్తున్న క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇరువురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

నిబంధనల ఉల్లంఘన..

◆ దుండిగల్ పరిసర ప్రాంతాలైన ఖాజిపల్లి, బొల్లారం పారిశ్రామికవాడల్లో వంద సంఖ్యలో పరిశ్రమలు ఉండటంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

◆ అయితే నో ఎంట్రీ సమయాల్లో భారీ వాహనాలను రోడ్డుకిరువైపులా నిలుపుతున్నారు. అసలే రోడ్లు ఇరుకుగా ఉండడంతో పాటు ప్రధాన రోడ్డు వెంట లైట్లు లేకపోవడంతో పార్క్ చేసిన వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

మద్యం మత్తులో డ్రైవింగ్..

◆ ఇటీవల జరిగిన ప్రమాదాల్లో అధికంగా మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే జరిగాయని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. దుండిగల్ లా అండ్ ఆర్డర్ పోలీసులు నాకా బందీ నిర్వహిస్తుండగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు ఆయా ప్రాంతాల్లో బారీకేడ్లను ఏర్పాటు చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయినా ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి.

దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ప్రమాదాలు..

సంవత్సరం	మొత్తం కేసులు	మరణాల సంఖ్య	క్షతగాత్రులు
2020	134	49	89
2021	153	44	118
2022	119	42	82
2023	115	38	77
2024	113	41	72
2025 (ఇప్పటి వరకు)	99	22	59



ప్రమాదానికి కారణమైన భారీ వాహనం (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



ప్రమాదాల నివారణకు చర్యలు ..

ట్రాఫిక్, మున్సిపల్, ఆర్ అండ్‌బీ అధికారుల సమన్వయంతో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోల్చితే ప్రమాదాల సంఖ్య తగ్గింది. గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టిన ఘటనలో వాహనాలను గుర్తించడం ఇబ్బందిగా మారింది. దీంతో ప్రధాన రోడ్లు అయిన బహదూర్‌పల్లి, గండిమైసమ్మ, గాగిల్లాపూర్ చౌరస్తా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. తరచూ వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

–సతీశ్, దుండిగల్ సీఐ

ప్రమాద కేంద్రాలను గుర్తించాం..

గతంలో బహదూర్‌పల్లి నుంచి దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు వరకు ప్రమాదాలు ఎక్కువగా జరిగేవి. అక్కడ డివైడర్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాం. గండిమైసమ్మ నుంచి బాచుపల్లి వరకు ఉన్న రోడ్డులో సైతం బారీకేడ్లను ఏర్పాటు చేశాం. టీ జంక్షన్లు ఉన్న వాటిని మూసేసి యూటర్న్‌లు క్లోజ్ చేశాం. దీంతో గల్లీల నుంచి వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఉంటారు. అలాగే నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తూ పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

– డి.శ్రీనివాస్, జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ

వరద నీటి సమస్యను పరిష్కరించండి

అల్విన్‌కాలనీ: ఇటీవల కురిసిన వర్షాలకు ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ వాసులు సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వరద నీటి సమస్యపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వర్షపు నీటితో పాటు మట్టి కూడా రోడ్డు మీదకు రావడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని తొలగించాలని కోరారు. భారీ వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులు, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టి గౌడ్, ఆంజనేయ ప్రసాద్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



రాఘవేంద్ర నగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

డివిజన్ అభివృద్ధికి కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ప్రజలు తమపై చూపిస్తున్న అదరాభిమానాలకు రుణపడి ఉంటానన్నారు. ఆదివారం ఆయన హస్మత్‌పేట బోయిన్ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన వీధి దీపాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. గత కొన్ని రోజులుగా చెరువు కట్టపై వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన కార్పొరేటర్ జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ డీఈ స్వప్న దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె చెరువు కట్టపై 20 వీధి దీపాలను ఏర్పాటు చేయించారు. వాటిని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఇర్ఫాన్, జనరల్ సెక్రటరి మేకల హరినాథ్, నాయకులు కర్రె జంగయ్య, బల్‌రాజు, మక్కాల సత్యనారాయణ, రాజుగౌడ్, మైపాల్‌రెడ్డి, గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



వీధి దీపాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

శ్రీ విజయగణపతి ఆలయంలో చాగంటి కోటేశ్వరరావు పూజలు

కేపీహెచ్‌బీకాలనీ: వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో కేపీహెచ్‌బీ డివిజన్, 9వ ఫేజ్‌లోని శ్రీ విజయగణపతి దేవాలయంలో శ్రీ వినాయక వైభవం కార్యక్రమంలో భాగంగా రెండు రోజులుగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు చేస్తున్నారు. ఆదివారం చాగంటి కోటేశ్వరరావు ఆయన సతీమణి సుబ్రహ్మణ్యేశ్వరీ, కుమారుడు షణ్ముఖ చరణ్ విజయ గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఘనంగా యోగా నయాన్స్ వార్షికోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సాయిబాబా నగర్‌లోని మాధవరం నగర్ యోగా టీచర్స్ ఆధ్వర్యంలో యోగా నయాన్స్ బ్రాంచ్ రెండవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యోగా మాస్టర్ బత్తిని కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్య ప్రదర్శన, యోగ విద్యార్థుల ఆసనాలు ఆహూతులను అలరించాయి. అనంతరం యోగా మాస్టర్ బత్తిని కిషన్ మాట్లాడుతూ.. నిత్యం యోగా సాధన చేయడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. యోగా అంటే జీవాత్మ, పరమాత్మ కలయిక అని, ప్రాచీన భారతదేశంలో సనాతన ధర్మంలో యోగా అనేది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధన అని తెలిపారు. యోగా శరీరం, మనస్సు, ఆత్మను ఏకం చేస్తుందన్నారు. యోగతో ఆరోగ్యంగా, ఆధ్యాత్మికంగా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో యోగ మాస్టర్స్ విజయ్, మురళి, నర్సింహారావు, తేజు, శ్రవణ్, ఉష సుశీల, సూర్య హఠ యోగ సెంటర్ ఫౌండర్ సూర్య, నయాన్స్ యోగా సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు కిట్ల పంపిణీ

సుభాష్‌నగర్: మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు బైరి భాస్కర్‌గౌడ్ తన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పారిశుధ్య కార్మికుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారికి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా బైరి భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ తాను విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని, అందుకే వారి సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు జరుపున్నట్లు తెలిపారు.

గణేశ్ ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న వినాయ మండపాల దగ్గర ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండపాల వద్ద భక్తులు కూర్చునేందుకు, భజనలు, పూజలు నిర్వహించుకునేలా మండపాల చుట్టూ మట్టిని చదును చేసే పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద ఆధ్యాత్మికత వెల్లివిరిసేలా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. తనవంతుగా ఇబ్బందులు తలెత్తకుండా చూస్తానని భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా మండపాల నిర్వాహకులు తగిన జగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, చందు తదితరులు పాల్గొన్నారు.

మంజీరా నీళ్లు వృథా..

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లోని ఎన్ఏఎస్ కన్వెన్షన్ హాల్ ఎదుట ప్రధాన రహదారిపై మంజీరా వాటర్ పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు వృథాగా పోతోంది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ కారణంగా నీరు రోడ్డు మీదుగా ప్రవహించి ఛత్రపతి శివాజీ పార్క్ వరకు వెళ్తున్నట్లు వారు పేర్కొన్నారు. గంటల తరబడి నీరు వృథా అవుతున్న సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన..

సుభాష్‌నగర్: సూరారం విశ్వకర్మ కాలనీలో ఆదివారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో బీపీ, డయాబెటిస్, గైనిక్, పీడియాట్రిక్ వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 60 మంది చిన్నపిల్లలు, 150 మంది స్త్రీ, పురుషులకు ఉచిత కన్సల్టేషన్ నిర్వహించి మందులు అందజేశారు. అవసరమైన వారికి హెల్త్ కార్డు అందజేసి ఉచితంగా చికిత్స, ఆపరేషన్లు నిర్వహిస్తామని మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

చెట్ల కొమ్మల తొలగింపు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్, శ్రీ వివేకానందనగర్ రోడ్డు నెంబర్ 9లో ప్రమాదకరంగా మారిన విద్యుత్ లైన్ సమస్యను అధికారులుపరిష్కరించారు. ఇంటర్నెట్ కేబుళ్ల కారణంగా విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఇరుక్కు పోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. స్థానికులు సమస్యను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవరింటి మస్తాన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన జీహెచ్ఎంసీ అధికారులకు సమస్యను వివరించారు. దీంతో ఆదివారం విద్యుత్ సిబ్బంది కరెంటు వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సహకారంతో కాలనీలో అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్,రమేష్ ఆచారీ, సతీష్‌రెడ్డి, జయరాం పాల్గొనానరు.



శ్రీవివేకానందనగర్‌లో చెట్ల కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

నేడు వికలాంగుల మహాగర్జన సన్నాహక సదస్సు

కూకట్‌పల్లి: మూసాపేటలో సోమవారం నిర్వహించనున్న వికలాంగుల మహాగర్జన సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి తిప్పరపు లక్ష్మణ్ మాదిగ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు రూ. 6 వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అన్ని రకాల చేయూత పెన్షన్లు రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా సోమవారం మూసాపేటలో చేయూత పెన్షన్ దారుల సన్నాహక సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ఏపీలో ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వికలాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచారని, తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగులను మోసం చేశారన్నారు. దీనిపై ప్రతిపక్షాలు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంద కృష్ణ మాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కూకట్‌పల్లి,కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని రకాల చేయూత పెన్షన్‌దారులు మహాసభకు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో దండోరా జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్వై అశోక్ మాదిగ, కేశపాగ రాంచందర్ మాదిగ, జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ, ముత్యపాగ శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌కు తరలిన బీఆర్ఎస్ నేతలు



సమావేశానికి తరలి వెళుతున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

ఆల్విన్‌కాలనీ: మియాపూర్‌లోని నరేన్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌యస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి వివేకానందనగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ నుంచి మియాపూర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో పాల్గొన్న ఎర్రబెల్లి సతీష్‌రావు